క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

అమడగూరు: జేకేపల్లి పంచాయతీలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటలకు హరిపురం, తనకంటిపల్లి, కందుకూరిపల్లిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

నిరుపేదల ద్రోహి చంద్రబాబు



చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తలుపుల: రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో ఇళ్లు లేని వేలాది మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తుంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఓర్వలేక పోతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం దుర్మార్గమన్నారు. సోమవారం మండల కేంద్రంలో చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. ఓవైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ పథకాల అమలు చేస్తుంటే తమ పార్టీ ఉనికి కోల్పోతుందేమోనని చంద్రబాబు నాయుడు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, సేవాదళ్ ఇన్‌చార్జి గికే బాబు, మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, అంజి, రమణ, ప్రభాకర్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లు స్కూల్ పాయింట్లకు చేర్చాలి



కిట్లను పరిశీలిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

కదిరి అర్బన్: ఈనెల 30వ తేదీ నుంచి జగనన్న విద్యాకానుక కిట్లు స్కూల్ పాయింట్లకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి చెన్నకృష్ణను ఎస్‌సీఈఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రాన్ని సందర్శించారు. జగనన్న విద్యాకానుక కిట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాకానుక కిట్ల పంపిణీలో అలసత్వం వహించొద్దన్నారు. ప్రతి బండిల్స్‌లో పుస్తకాలు సరిగా ఉన్నాయా లేదా అని సరిచూసుకోవాలని సూచించారు.

పేదలపై భారం పడకుండా ఇళ్ల నిర్మాణాలు



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శంకర్‌లాల్

కనగానపల్లి: పేదలపై భారం పడకుండా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపడుతోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన జగనన్న కాలనీల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు స్థలాన్ని అందించి ఉచితంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. తద్వారా పేదలపై ఎలాంటి భారం పడకుండా ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరక్టర్ ప్రభాకర్, హౌసింగ్ పాల్గొన్నారు.

మహా శివలింగం, జ్యోతిర్లింగాల ఊరేగింపు



జ్యోతిర్లింగాలను ఊరేగిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: మున్సిపల్ పరిధిలోని ఎనుములపల్లిలో వెలసిన కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రతిష్ఠాపన నిమిత్తం కాశీ నుంచి 350 కిలోల బరువున్న మహా శివలింగం, 12 ద్వాదశ జ్యోతిర్లింగాలను ఆలయ కమిటీ సభ్యులు తీసుకొచ్చారు. ప్రజల దర్శనార్థం సోమవారం గణేష్ సర్కిల్ నుంచి కాశీవిశ్వేశ్వరాలయం వరకు ట్రాక్టర్‌పై ఊరేగించారు. పెద్ద ఎత్తున ప్రజలు శివలింగాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో సత్యసాయి విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేం

• ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి



పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: సంక్షేమ పథకాలు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికీ మరువలేదని ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ రఫీనాయక్, ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో మొత్తం 260 మందిని పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో ఇద్దరికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న పురస్కారాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు–ప్రభుత్వానికి వారధులుగా సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకో దాచుకో అన్న రీతిలో ప్రతి పనికి ఓ రేటు ప్రకారం తీసుకునేవారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కరి దగ్గర పైసా లంచం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్ ఆశయాలను వమ్ము చేయకుండా వలంటీర్లు పని చేయాలన్నారు. మీ పరిధిలోని ప్రతి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు (క్రిష్ణారెడ్డి), మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, సర్పంచ్‌లు టోపీరమణ, శ్రీరామ్‌రెడ్డి, షేక్షావలి, వెంకటనారాయణ, మల్లికార్జున, సుదర్శన్‌రెడ్డి, పెద్దినాయుడు, దివాన్‌వలి, కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్‌పీర్, రాజగోపాల్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మౌలా పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు విరాళం అందజేత

కదిరి అర్బన్: మండల పరిధిలోని చిగురుమాను తండా సమీపంలో చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠకు సోమవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి రూ.50 వేలు పంపించారు. ఈ మొత్తాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఇటీవల ఆలయ పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే టీటీడీ నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ముత్యాలచెరువు సర్పంచ్ విశ్వనాథ్, మండల కన్వీనర్ ప్రకాష్, సచివాలయాల కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, సర్పంచ్ నారాయణ నాయక్, శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



శేషయ్యగారి పల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందచేస్తున్నారని గుర్తు చేశారు. సోమవారం మండలంలోని కొండకరమర్ల పంచాయతీ పరిధిలోని మురికినీళ్లవంక తండా, ఎస్.కొట్టాలు, శేషయ్యగారిపల్లి, శేషయ్యగారిపల్లి తండా గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ.. బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో లేని విధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చారన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ నేరవేర్చకుండా గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతుందన్నారు. పథకాల సొమ్మును నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని గుర్తు చేశారు. మాయమాటలతో మభ్య పెట్టడం చంద్రబాబు నైజం అన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు మరోమారు గట్టిగా గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరో మారు సీఎం వైఎస్ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుర్లిదామోదర్ రెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆనందరెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, మండల కో–ఆప్షన్ సభ్యుడు నిషార్ అహమ్మద్, సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి, మాజీ సర్పంచ్ మారెన్న, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, చితంబర రెడ్డి, మోహన్‌నాయక్, నరేష్‌రెడ్డి, రమణ, ఆంజనేయులు, జైపాల్‌రెడ్డి, శరణ్‌కుమార్ రెడ్డి, సుబ్బిరెడ్డి, హనుమంతరెడ్డి, మధుసూదన రెడ్డి, హనుమంత నాయక్, రవీంద్రరెడ్డి తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ పోలప్ప పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకుంటాం



బద్దలాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి తోటల రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బద్దలాపురంలో ఎమ్మెల్యే పర్యటించి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడారు. ఆయన అధికారులతో కలసి అరటి రైతులు చంద్రాయుడు, చిన్నకృష్ణారెడ్డి, నాగరాజు పొలాలకు పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ విపరీతమైన ఈదురు గాలుల వల్ల గెలలతో ఉన్న అరటి తోటలు నేలకూలాయన్నారు. దీంతో ఎకరానికి రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోయామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా అందిస్తోందన్నారు. జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో సాగుచేసే అరటి పంటకు ప్రభుత్వం ఇంకా పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదని హార్టికల్చర్ అధికారులు చెప్తున్నారన్నారు. దీనిపై శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వం దృష్టికి వెంటనే తీసుకెళ్లి, బాధిత రైతులకు పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డీఈ చంద్రశేఖర్, హెచ్ఓ అమరేశ్వరీ, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తలారి ప్రదీప్‌కుమార్‌కు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.50 వేల సాయం అందించారు. బద్దలాపురం గ్రామానికి చెందిన తలారి ప్రదీప్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. సోమవారం మండల ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ఆర్థిక సాయాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, నాయకులు పెద్దిరెడ్డి, సురేష్, దినేష్‌రెడ్డి, నరసింహులు, చంద్రాయుడు, నాగరాజు, గోపాల్ పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ పనులు జరగకుండా చూడాలి

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులతో ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్ నాగేంద్ర, సీఐ కంబగిరి రాముడికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. రోడ్డు బ్లాస్టింగ్ పనులు చేపట్టడంతో ఇళ్లలోని టీవీలు దెబ్బతింటున్నాయన్నారు. ఇళ్ల గోడలు నెర్రెలు చీలుతున్నాయన్నారు. అదే రోడ్డు మీద క్రషర్ యంత్రం కూడా ఉండటంతో దుమ్ము ధూళి రేగి అనారోగ్యానికి గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి బ్లాస్టింగ్ పనులు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా క్రషింగ్ మిషన్‌ను గ్రామం వెలుపల ఉంచి కంకరను క్రషింగ్ చేయించుకోవాలని కోరారు. చంద్రాయుడు, ప్రకాష్, మనోహర్, సాంబశివ, సుధాకర్, రామాంజినేయులు పాల్గొన్నారు.

4,013 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు

అమడగూరు: ఖరీఫ్‌లో సాగు చేసేందుకు రైతులకు నాణ్యమైన వేరుశగన కాయలను అందించాలని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అమడగూరు రైతుభరోసా కేంద్రంలో విత్తన కాయలను పరిశీలించారు. వేరుశనగ కాయలు బాగున్నాయని తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న రైతులకు సరిపడేలా వేరుశనగ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని రైతులను గుర్తించి 4,013 క్వింటాళ్ల కే6 రకం కాయలను కేటాయించడం జరిగిందని వ్యవసాయాధికారి జ్యోత్స్న పేర్కొన్నారు. ఇప్పటికే 300 క్వింటాళ్లు నిల్వ ఉంచామన్నారు. మొదటి రోజే 250 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ సురేంద్రరెడ్డి, అశ్వర్థనారాయణ, ఏఈఓ షరీఫ్, పాల్గొన్నారు.

వ్యవసాయ గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: జిల్లాలో రైతుల ప్రయోజనాల కోసం మల్టీపర్పస్ వ్యవసాయ గోడౌన్‌లను నిర్మిస్తున్నట్లు జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రూ.63 లక్షల వ్యయంతో వ్యవసాయ గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. జిల్లాలో 180 గోదాముల నిర్మాణానికి అనుమతులు వచ్చినట్లు తెలిపారు. 1000 టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పండిన పంటకు గిట్టు బాటు ధర లేకున్నప్పుడు గోదాములో నిల్వ ఉంచుకుని గిట్టు బాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు గోవర్దన్‌రెడ్డి, ఏఓ సతీష్, కాంట్రాక్టర్ అశోక్‌రెడ్డి, గ్రామ అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ రంగారెడ్డి, బట్టల కేశప్ప పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శివంపల్లిలో పథకాలపై ఆరా తీస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

తాడిమర్రి: మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులందరికీ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం శివంపల్లి గ్రామంలో డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. వలంటీర్ల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పథకాలు, వలంటీర్ల సేవలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లోని పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పిల్లలను బడులకు పంపే తల్లులకు అమ్మఒడి, రైతులకు రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక అందజేస్తున్నారని తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వరం పరిష్కారమయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు తిమ్మారెడ్డి, హరినాథ్‌రెడ్డి, జగనానందరెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణరెడ్డి, మదమంచి మల్లికార్జున నాయకుడు, సిద్దే ఆదిరెడ్డి, తాడిమర్రి తిమ్మారెడ్డి, హనుమంతరెడ్డి, శివంపల్లి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, వీహెచ్ఏ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



ఆర్డీఓ తిప్పేనాయక్‌తో చర్చిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు

ధర్మవరం అర్బన్: చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ తిప్పేనాయక్‌తో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమావేశం నిర్వహించారు. పలు చేనేత సమస్యలు, పవర్‌లూమ్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేత కార్మికుల జీవన పరిస్థితి కొంత కష్టతరంగా ఉందన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని చేనేత కార్మికులకు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పవర్‌లూమ్స్‌పై దాడులు కొనసాగిస్తున్నామన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పవర్‌లూమ్స్‌లో ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధర్మవరంలో చేనేత పరిశ్రమను కాపాడటమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, ఏడీఓ శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న పోలం సిద్దారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వలంటీర్లను సత్కరిస్తారని పేర్కొన్నారు.

పురస్కారాలకు 162 మంది ఎంపిక

ధర్మవరం రూరల్: మండలంలో 162 మంది వలంటీర్లకు త్వరలో సేవా పురస్కారాలను అందజేయనున్నట్లు ఎంపీడీఓ మమతాదేవి తెలిపారు. వీరిలో 156 మంది వలంటీర్లకు సేవామిత్ర, 5 మందికి సేవా రత్న అవార్డులకు ఎంపికయ్యారన్నారు. సేవా రత్న అవార్డులకు చిగిచెర్ల సచివాలయంలో ఇద్దరు, నేలకోటలో ఒకరు, ఏలుకుంట్లలో ఒకరు, మల్లాకాలువలో ఒకరిని ఎంపిక చేశామన్నారు. అలాగే చిగిచెర్ల సచివాలయ పరిధిలో పనిచేసే ఒక వలంటీరుకు సేవావజ్ర అవార్డు దక్కనుందన్నారు. త్వరలో ఈ అవార్డులను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లచెరువు: నల్లచెరువు, ఓరువాయిలో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శకుంతల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బత్తలపల్లి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. దంపెట్లలో (బీసీ జనరల్), నల్లబోయనపల్లిలో (ఓసీ జనరల్), తంబాపురంలో (ఓసీ జనరల్) ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

నల్లమాడ: మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాగినేని చిన్న రెడ్డెప్ప నాయుడు భార్య రమణమ్మ (50) ఇటీవల ప్రమాదవశాత్తు చింతచెట్టు మీద నుంచి కిందపడింది. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రమణమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగినేని సరస్వతి, నాయకుడు నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వర్ణలత సోమవారం తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ముదిగుబ్బ: మండలంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులకు నేలకొరిగిన బొప్పాయి, అరటి, మొక్కజొన్న తదితర పంటలను సోమవారం వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలో అరటి 85 ఎకరాలు, బొప్పాయి 5 ఎకరాలు, మొక్కజొన్న 10 ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందన్నారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు.

యూనిఫాం తనిఖీ

ముదిగుబ్బ: స్థానిక ఎమ్మార్సీ భవనంలో నిల్వ ఉంచిన విద్యార్థుల యూనిఫాంను సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠ్యపుస్తకాలు ఎన్ని వచ్చాయి? ఇంకా ఎన్ని రావాల్సి ఉందని ఆరా తీశారు. యూనిఫాం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఓ రవి, ఏపీఎం హేమలత పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

పుట్టపర్తి టౌన్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు గౌసలాజమ్, లక్ష్మి, ఈశ్వరమ్మ, యశోద, చిట్టి, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో వేరుశనగ అందించాలి

తనకల్లు: విత్తన వేరుశనగను 90 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మధునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కదిరప్ప, మండల కార్యదర్శి రెడ్డెప్ప పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 16 అర్జీలు రాగా.. వాటిలో 12 అర్జీలు భూ సమస్యలపై, సర్వే కోసం 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ యుగేశ్వరి దేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

• నేలమట్టమైన నర్సరీలు
• ఉద్యాన పంటలకు నష్టం



లింగారెడ్డిపల్లి వద్ద దెబ్బతిన్న అరటి

బత్తలపల్లి: బత్తలపల్లిలో ఆదివారం రాత్రి ఈదురు గాలుల బీభత్సానికి తొమ్మిది నర్సరీలు నేలమట్టం అయ్యాయి. ఇదే సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడటంతో రెండు నర్సరీలు కాలిపోయాయి. దాదాపు రూ.25 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు నిర్వహకులు వాపోయారు. నష్టం పరిహారం అందేలా చూడాలని వీహెచ్‌ఏ హరిప్రియను నర్సరీ యజమానుల సంఘం నాయకులు గోవిందు గంగులప్ప కోరారు.

మాల్యవంతం, బత్తలపల్లి, పోట్లమర్రి, సంజీవపురం, ఈదుల ముష్టూరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. లింగారెడ్డిపల్లిలో చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి రైతులకు చెందిన అరటి 9 ఎకరాలు, సంజీవపురంలో రామాంజనేయులు బొప్పాయి నాలుగు ఎకరాలు, రాఘవంపల్లిలో కాటమయ్య, నారాయణస్వామికి చెందిన 5 ఎకరాల్లో అరటి పంట, వెంకటగారిపల్లిలో భాస్కర్‌నాయుడు, నాగరాజు, రామాంజనేయులుకు చెందిన 20 ఎకరాల్లో అరటి పంట, లక్ష్మీనారాయణ, రాము, రామాంజనేయులు, శ్రీనివాసులు, రమణప్ప, బాలకృష్ణకు చెందిన 25 ఎకరాల్లో బొప్పాయి, బాలకృష్ణ, శ్రీనివాసులుకు చెందిన మామిడి తోట 10 ఎకరాల్లో దెబ్బతింది. చంద్రశేఖర్ రెండు ఎకరాల్లో సాగు చేసిన బంతి పూలు, గంటాపురంలో ప్రవీణ్, కిరణ్, కృష్ణమూర్తి, ఆనంద్, వెంకటరమణ, వెంకటనారాయణ, వసీకేరప్ప 25 ఎకరాల్లో సాగు చేసిన అరటి నేలకూలింది. ఈదుల ముష్టూరులో రవీంద్రారెడ్డి, గోవర్దన్ రెడ్డి, ఈరమ్మ, ఈశ్వరమ్మలకు చెందిన 5 ఎకరాల్లో వరి దెబ్బతింది. చంద్రకళ 3 ఎకరాల్లో సాగు చేసిన అరటి, దామోదర్ నాయుడు 4 ఎకరాల్లో సాగు చేసిన నేరేడు 50 చెట్లు నేలకూలాయి. దంపెట్లలో లక్ష్మీనారాయణరెడ్డి నాలుగు ఎకరాల్లో సాగు చేసిన అరటి నేలవాలింది. పంట నష్టంపై రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయశాఖ అసిస్టెంట్‌లు సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది.

ట్రాన్స్‌కోకు రూ.15 లక్షల నష్టం

బత్తలపల్లి: ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మండలంలో ట్రాన్స్‌కోకు దాదాపు రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. లింగారెడ్డిపల్లి విద్యుత్ ఉపకేంద్రం నుంచి సరఫరా అయ్యే విద్యుత్‌లో తీవ్ర అంతరాయం కలిగినట్లు వివరించారు. 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్‌లకు సంబంధించిన దాదాపు 114 విద్యుత్ స్తంభాలు నేలకూలినట్లు పేర్కొన్నారు. వీటి మరమ్మతులు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. సోమవారం లింగారెడ్డిపల్లి, అనంతసాగరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. మంగళవారం సంజీవపురం, యర్రాయపల్లి, ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.